క్లుప్తంగా

బోయకొండలో చండీ హోమం


హోమం చేస్తున్న వేద పండితులు

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా చండీ హోమం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారి ఉత్సవమూర్తిని యాగశాలలో కొలువుదీర్చారు. ఆలయ ఈఓ ఏకాంబరం తోపాటు ఉభయదారులు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేక పూజలు చేశారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున ఈ హోమ పూజలు చేయడం పరిపాటి. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలి

పుంగనూరు: వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని వాల్మీకి సంఘ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బీఎంఎస్‌క్లబ్‌లో వాల్మీకుల సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు. ఎస్టీ రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించి, ఎస్టీల జాబితాలో వాల్మీకులను చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న వాల్మీకి సంఘ నాయకులు

పెద్దపంజాణి: మండలంలోని బెరపల్లెకు చెందిన బి.రామస్వామి వారం క్రితం మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం పెద్దపంజాణి వాల్మీకి సేవా సంఘం తరఫున మృతుని భార్య సుబ్బమ్మకు రూ 30 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.భాస్కర్, పెద్దపంజాణి మండల శాఖ అధ్యక్షుడు శంకరప్ప, డాక్టర్ సుబ్రమణ్యం, చిన్నూరు శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రగ్బీ క్రీడాకారిణికి సన్మానం

పలమనేరు: పట్టణానికి చెందిన జాతీయ రగ్బీ క్రీడాకారిణి అక్షయను స్థానిక సామాజిక సేవకులు మధుమోహన్ ఆదివారం సన్మానించారు. ఏసియన్ రగ్బీ క్రీడలో దేశానికి కాంస్య పతకం సాధించడంలో కీలకమైన పాత్ర పోషించి ఆమె పలమనేరుకు దేశస్థాయిలో పేరు తెచ్చి పెట్టిందని అభినందించారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి


వెంకటాచలం (ఫైల్)

కుప్పం రూరల్: కుప్పం మండలం, వెండుగంపల్లి ఎంపీటీసీ అలిమేలు భర్త, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటాచలం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఈయనకు ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వెంకటాచలం మృతికి ఎమ్మెల్సీ భరత్, మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్, పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

11న శ్రీ సచ్చిదానంద సరస్వతి రాక

పుంగనూరు: పట్టణంలోని హరహరపుర మఠాధిపతి శ్రీ స్వయంప్రకాశ సచ్చిదానంద సరస్వతి మహాస్వామి ఈనెల 11న పట్టణంలో పర్యటించనున్నారు. ఆ రోజున స్వామిజీ శోభాయాత్ర నిర్వహించనున్నట్టు ఆదివారం బ్రాహ్మణ సంఘ నాయకులు తెలిపారు. ఈయాత్రలో సాంప్రదాయ దుస్తులు ధరించి, వేదపారాయణం, లలితా పారాయణం చేస్తారని, హిందూ ధర్మం పాటించే వారందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రైవేటు స్కూళ్ల ఉత్తమ టీచర్లకు సన్మానం

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని అపుస్మా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్-ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు సీఆర్ మహేష్ రెడ్డి అన్నారు. అపుస్మా ఆధ్వర్యంలోని నగరంలోని ప్రైవేట్ పాఠశాలల ఉత్తమ టీచర్లను ఆదివారం కొంగారెడ్డిపల్లెలోని ఓ హోటల్‌లో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, ఉత్కృష్టమైనది ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. ముఖ్య అతిథిగా విశ్రాంత హెచ్‌ఎం రాజారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లను గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు. విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి, గౌరవాధ్యక్షుడు ఎస్‌ఎస్‌కే రాజా మాట్లాడారు. 70మంది టీచర్లను సన్మానించారు. అసోసియేషన్ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, కృష్ణ, లక్ష్మీప్రసాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమికి డిపాజిట్లు గల్లంతయ్యేలా పనిచేద్దాం

- కూటమి వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను సోషల్ మీడియాలో ప్రజలకు చాటిచెబుదాం
- రాబోవు రోజుల్లో గ్రామ కమిటీలే కీలకం
- 396 మందికి పదవులు


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పక్కన రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్ తదితరులు


హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

చౌడేపల్లె: రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి డిపాజిట్లు గల్లంతయ్యేలా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ స్థాయి కమిటీలు, సోషల్‌మీడియా యాక్టివిస్టులు పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఒక కల్యాణ మండలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సమావేశం ఏర్పాటు చేశారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతానికి పనిచేస్తూ ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో మళ్లీ పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఇప్పటి నుంచే పనిచేయాలని కోరారు. పుంగనూరు నియోజకవర్గంలో గ్రామ స్థాయి నుంచి కమిటీలు ఏర్పాటుచేసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, దౌర్జన్యాలు, మోసాలను చాటి చెప్పాలన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక జగనన్న సైనికుడు తయారవ్వాలని, సోషల్ మీడియాలో ప్రతి విషయాన్నీ ప్రజలకు తెలియజేసి చైతన్యవంతులు చేయాలని కోరారు.

రోల్ మోడల్‌గా పుంగనూరు నియోజకవర్గం

ఈనెల 28న నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి పంచాయతీలో రచ్చబండ కార్యక్రమంతో పార్టీశ్రేణులన్నీ మమేకమవ్వాలని ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ ప్రధాన కార్యదర్శి (యాక్టివిటీ) వజ్రభాస్కర్ కోరారు. ప్రతి గ్రామంలో ఈనెల 15వ తేదీలోపు కమిటీల నియామకం ప్రక్రియను పూర్తిచేసి మొత్తం 64 మందిని గ్రామస్థాయిలో ఎంపికచేయాలన్నారు. రోల్‌మోడల్‌గా పుంగనూరు నియోజకవర్గాన్ని ఎంపికచేశామని, తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఈ తరహాలోనే చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. నియోకవర్గంలో 12,500 మంది కార్యకర్తలను కమిటీలతో ఎంపిక చేసి పార్టీ కార్యక్రమాలు, సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో సెకన్ల వ్యవధిలోనే చేరవేసేలా రూపొందించినట్లు పేర్కొన్నారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఎస్.దామోదరరాజు మాట్లాడుతూ, ఏ కష్టమొచ్చినా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.మండలంలో 19 పంచాయతీల్లో గ్రామస్థాయిలో మొత్తం 396 మందిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, వెంకటరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మిద్దింటి కిషోర్ బాబు, విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్, పార్టీ మండల ఇన్‌చార్జి చెంగారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెంకటరమణ, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

చంద్ర గ్రహణం.. మూతపడిన ఆలయాలు




మూతపడిన బోయకొండ ఆలయం, పుంగనూరు: మూసివేసిన ఆలయాలు

చౌడేపల్లె: పాక్షిక చంద్ర గ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బోయకొండ గంగమ్మ ఆలయాన్ని మూసివేసినట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. అలాగే సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ ఆలయంతోపాటు మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయం, పలు ఆలయాలకు అర్చకులు మధ్యాహ్నం 12 గంటలకే మూసివేశారు. గ్రహణ దోష నివారణ పూజల అనంతరం సోమవారం యధావిధిగా దర్శన భాగ్యం కల్పిస్తామని తెలిపారు.

పుంగనూరులో..

పుంగనూరు: చంద్రగ్రహణం కారణంగా పలు ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. పట్టణంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేశారు. తిరిగి ఆలయాన్ని సోమవారం మధ్యాహ్నం ఆలయాన్ని శుద్ధిచేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. అలాగే భోగనంజుండేశ్వరస్వామి, గూడూరుపల్లె వద్ద లక్ష్మీనరసింహస్వామి, చాముండేశ్వరి ఆలయం, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం, సోమేశ్వరస్వామి ఆలయం, మాణిక్య వరదరాజస్వామి ఆలయం, మారెమ్మ ఆలయాలు, షిరిడి సాయిబాబా ఆలయాలను మూసివేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



వి.కోట: రోగులను పరీక్షిస్తున్న కంటి వైద్య నిపుణులు, బైరెడ్డిపల్లెలో..

వి.కోట: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి వైద్య బృందం ఈ శిబిరంలో 240 మంది వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 51 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి 38 మందిని అరవింద్ ఆస్పత్రికి తరలించారు. 13 మందికి షుగర్, బీపీ ఎక్కువగా ఉండడంతో వారికి నిపుణులు సూచనలు-సూచనలు ఇచ్చినట్టు నిర్వాహకులు శ్యామ్ ఫౌండేషన్ సభ్యులు రెడ్డెప్ప, ఉదయ్‌కుమార్ తెలిపారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఆదివారం మహతి ఫౌండేషన్ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించింది. శిబిరంలో కుప్పం పీఈఎస్ ఆసుపత్రి వైద్య బృందం 35 మందికి వైద్య పరీక్షలు చేసి ఐదుగురిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసింది. శిబిరంలో కుప్పం పీఈఎస్ వైద్యులు మానస, నిహారిక, ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పుస్తకాలున్న ఇళ్లన్నీ గ్రంథాలయాలే


పుస్తకంతో నడక కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

- పలమనేరులో 'పుస్తకంతో నడక' విజయవంతం

పలమనేరు: పుస్తకాలున్న ఇళ్లన్నీ గ్రంథాలయాలేనని పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయం «పుస్తకంతో నడక» కార్యక్రమం నిర్వహించింది. గ్రంథాలయాల ఆవశ్యకత, పుస్తక పఠనంపై ప్రజల్లో ఆసక్తిని కలిగించేందుకు పట్టణంలో పుస్తకాలతో ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కమిషనర్ మాట్లాడారు. సమాజ నిర్మాణానికి పుస్తకాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. వయసుతో సంబంధం లేకుండా ఎవరైననూ తీరిక సమయంలో స్మార్ట్‌ఫోన్లను పక్కనబెట్టి కాసేపు మంచి పుస్తకాలను చదవాలని కోరారు. స్థానిక రచయితల సంఘ నాయకులు పలమనేరు బాలాజీ మాట్లాడుతూ, ప్రపంచాన్ని మార్చే శక్తి కేవలం పుస్తకాలకు మాత్రమే ఉందన్నారు. పుస్తకాలను చదివి మంచి వ్యక్తిత్వం కలిగి, సమాజ పరంగా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు యుగంధర్, రచయితలు కుమారస్వామిరెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, తులసీనాథం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

601 టన్నుల యూరియా పంపిణీకి చర్యలు


ఏడీ శివకుమార్

పుంగనూరు: పుంగనూరు వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ చేస్తున్నట్లు ఏడీ శివకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, రొంపిచెర్ల, పులిచెర్లతో పాటు పెద్దపంజాణి, గంగవరం మండలాల రైతులకు బయోమెట్రిక్ ద్వారా 601 టన్నుల యూరియాను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రైతులు తమ పాసుపుస్తకాలు తీసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయా ఆర్‌ఎస్‌కేలలో యూరియాను పొందాలని కోరారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా తమకు తెలియజేయాలని కోరారు.

మండలానికి 81 టన్నుల యూరియా


చౌడేపల్లెలోని రైతు సేవా కేంద్రంలో దింపుతున్న యూరియా బస్తాలు

చౌడేపల్లె: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీకి చర్యలు తీసుకున్నట్టు వ్యవసాయాధికారి మోహన్‌కుమార్ తెలిపారు. మండలానికి 81 టన్నుల యూరియా వచ్చిందని, 12 రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేస్తామని, అవసరమైన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జెరాక్సులతో హాజరై బయోమెట్రిక్ వేసి, ఒక బస్తా పొందవచ్చన్నారు.

ప్రత్యామ్నాయ ఎరువులతో అధిక దిగుబడి


వరి పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

- జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

గంగవరం: వరి సాగులో యూరియాకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులు, నానో యూరియా, పచ్చిరొట్ట ఎరువులు వాడితే అధిక దిగుబడులు సాధించడమే కాకుండా కాలుష్య నియంత్రణ, నేల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు.. ఆదివారం మండలంలోని మారేడుపల్లెలో పర్యటించిన ఆయన నానో యూరియా వాడకంపై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. పలు రైతు సేవా కేంద్రాల్లో సోమవారం చేయబోయే యూరియా పంపిణీ ప్రణాళికపై వ్యవసాయ సిబ్బందితో చర్చించారు. వరి సాగు చేసే రైతులను దృష్టిలో ఉంచుకుని ప్రతి రైతు సేవా కేంద్రంలో యూరియా అందుబాటులో ఉంచుతున్నట్టు చెప్పారు. అనంతరం గ్రామ పరిసరాల్లోని వరి పొలాల వద్ద పొలం బడి నిర్వహించారు. ఆ తర్వాత మండల కేంద్రంలోని పీఏసీఎస్ సొసైటీలో ఎరువుల స్టాక్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి రఖీబా, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రేమలత, రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భారీ గణనాథుని విగ్రహ నిమజ్జనం


ఎస్‌ఎస్ పేటలో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుని విగ్రహం

పుంగనూరు: పట్టణంలోని ఎస్‌ఎస్ పేటలో 22 అడుగుల ఎత్తు గల పంచముఖి గణపతి విగ్రహాన్ని ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు కలసి కోలాహలంగా నిమజ్జనం చేశారు. 10 రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడు మేళతాళాలు, బళ్లారి డ్రమ్ములు, బాణ సంచా మోత నడుమ యువత సందడి చేస్తూ పురవీధుల్లో ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్లారు. ప్రజలు టెంకాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు.

అడ్డగోలుగా అక్రమ లేఔట్లు

- పనిచేయని చట్టాలు
- దాసోహమైన అధికారులు


చిన్నారిదొడ్డి వద్ద వేసిన భారీ లేఔట్

నిబంధనలకు పాతరేసి వ్యవసాయ భూములను లేఔట్లుగా మార్చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు. ఇవి నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఔట్లని తెలియక స్థలాలు కొనుగోలు చేసి పలువురు తమ కష్టార్జితాన్ని నష్టపోతున్నారు. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన సంబంధిత అధికారులు ఈ బాగోతం తెలిసినా రియల్ వ్యాపారులకు సహకరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

శాంతిపురం: మండలంలోని తుమ్మిశి-రాళ్లబూదుగూరు జూనియర్ కాలేజీ రోడ్డులో మూడు అక్రమ లేఔట్లలో ప్లాట్ల విక్రయాలు చేస్తుంటే, మరో రెండు సిద్ధమవుతున్నాయి. పంచాయతీ కేంద్రమైన చిన్నారిదొడ్డిలో గ్రామ సచివాలయం ఎదుటనే భారీ వెంచర్ వేశారు. ఇక్కడ వందకు పైగా సైట్లను వేసి విక్రయాలకు పెట్టారు. తమ కళ్లెదుటే రియల్ ఎస్టేట్ వ్యవహారాలు సాగుతున్నా అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. లేఔట్ పనుల ప్రారంభంలో సైట్ల రాళ్లను తొలగించి హడావుడి చేసిన రెవెన్యూ అధికారులు తర్వాత పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది! గ్రామ కంఠం భూమిని కూడా ఆక్రమించి సైట్లు వేశారని స్థానికులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. తుమ్మిశి-నడింపల్లె మధ్య, రాళ్లబూదుగూరు జూనియర్ కళాశాల ఎదుట మరో రెండు లేఔట్లు వెలిశాయి. వ్యవసాయ భూమిని ఇతర అవసరాలకు బదలాయించకుండా, లేఔట్ నిబంధనలు పాటించకుండా ప్లాట్లను జనానికి అంటగడుతున్నారు. చట్టబద్ధంగా రెవెన్యూ కన్వర్షన్, పంచాయతీ అప్రూవల్ లేని లేఔట్లలో స్థలం కొన్నవారు భవిష్యత్తులో అక్కడ ఇల్లు కట్టాలంటే భూమి విలువలో ఏకంగా 14 శాతం పంచాయతీకి చెల్లించాల్సి ఉంటుంది. భారీగా పెట్టుబడి పెట్టి నిబంధనలు తెలియక అక్రమ లేఔట్లలో స్థలాలు కొన్నవారు భవిష్యత్తులో మానసిక క్షోభకు, ఆర్థిక నష్టానికి గురికావాల్సి వస్తోంది.

అధికారుల ఉదాశీనత

అక్రమ లేఔట్లపై అధికారుల ఉదాశీన వైఖరి అవలంభించడం అనుమానాలకు తావిస్తోంది. భారీగా సొమ్ము చేతులు మారాయనే ఆరోపణలు వస్తున్నాయి. చిన్నారిదొడ్డి వద్ద ఉన్న మెగా లేఔట్ వెనుక కుప్పం మున్సిపాలిటీకి చెందిన అధికార పార్టీ నాయకుడు ఒకరు ఉన్నట్లు ప్రచారమవుతోంది. ఆయన డైరెక్షన్‌లో అధికారులు పనిచేస్తూ తమ మాటను పట్టించుకోవటం లేదని స్థానిక టీడీపీ నాయకులు గుర్రుగా ఉన్నారు. దీనిపై రెవెన్యూ శాఖలోని ఓ అధికారిని టీడీపీ నాయకులు నిలదీస్తే చేతనైతే తనను బదిలీ చేయించాలని సదరు అధికారి సవాల్ చేసినట్టు తెలిసింది.

ఇవీ నిబంధనలు

లేఔట్ వేయాలనుకునే వ్యాపారులు, భూస్వాములు నిర్ణీత రుసుం చెల్లించి తమ భూములను విధిగా వ్యవసాయేతర అవసరాల భూమిగా రెవెన్యూ శాఖతో కన్వర్షన్ చేయించుకోవాలి. దీని విస్తీర్ణంలో 10 శాతం భూమిని స్థానిక పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడంతో పాటు పార్కును అభివృద్ధి చేయాలి. అప్రోచ్ రోడ్ 40 అడుగులు, లోపల 30 అడుగుల వెడల్పుతో రోడ్లు వేయాలి. వాటికి ఇరువైపులా వృక్షసంపద పెంపు కోసం మొక్కలు నాటి పెంచడంతోపాటు విద్యుత్ లైన్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. అన్ని సైట్లకు కొళాయిలు, మురుగు నీటి కనెక్షన్లు కల్పించి మురుగు కాలువలు కట్టాలి. మొత్తం మురుగునీరు బయటకు వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి. రక్షిత మంచినీటి కోసం బోరు, ఓవర్ హెడ్ ట్యాంక్ సదుపాయాలు కల్పించాలి. కానీ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ లేఔట్లలో ఇవేవీ మచ్చుకైనా కనిపించడం లేదు. నిబంధనలు పాటించని లేఔట్లపై కొరడా ఝళిపించి రెవెన్యూ, పంచాయతీరాజ్ వ్యవస్థలు ఇంటి స్థలాలు కొన్న వారి ప్రయోజనాలను కాపాడతారా? అనేది ఇప్పుడు ముందున్న ప్రశ్న.

చెప్పినా పట్టించుకోని రియల్టర్లు

చిన్నారిదొడ్డి పంచాయతీ కార్యదర్శి సుమయను భారీ లేఔట్‌పై వివరణ కోరగా.. అప్రూవల్ చేయించుకోవాలని తాను పదేపదే చెప్పినా రియల్టర్లు పట్టించుకోవడం లేదన్నారు. దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఈరోజు

వైఎస్సార్ సీపీ సమావేశం

సదుం: మండల వైఎస్సార్ సీపీ సమావేశం ఎర్రాతివారిపల్లెలో సోమవారం మధ్యాహ్నం 1.45 గంటలకు నిర్వహించనున్నట్టు పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

5 ఆర్‌ఎస్‌కేల్లో యూరియా పంపిణీ

గంగవరం: మండలంలోని దండపల్లె, మామడుగు, గండ్రాజుపల్లె, గంగవరం, గుండుగల్లు రైతు సేవా కేంద్రాల్లో సోమవారం యూరియా పంపిణీ చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి రఖీబా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన చోట్ల త్వరలో పంపిణీ చేయనున్నట్టు తెలియజేశారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో సోమవారం రైతులకు 2,250 యూరియా బస్తాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయశాఖాధికారిణి గీతాకుమారి తెలిపారు. గొల్లచీమనపల్లె, పెద్దచల్లారగుంట, ఆల్లపల్లె రైతులకు గొల్లచీమనపల్లె రైతు సేవా కేంద్రంలో తీర్థం, దేవదొడ్డి, గడ్డూరు రైతులకు, తీర్థం రైతు సేవా కేంద్రంలో పాతూరునత్తం, కడపనత్తం, వెంగంవారిపల్లె రైతులకు, పాతురునత్తం రైతు సేవా కేంద్రంలో నెల్లిపట్ల, చప్పిడిపల్లె, ధర్మపురి రైతులకు, నెల్లిపట్ల రైతు సేవా కేంద్రంలో కంభంపల్లె, బేలుపల్లె, బైరెడ్డిపల్లె రైతులకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేయనున్నట్టు తెలియజేశారు.

పెద్దపంజాణి మండలంలో..

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట, రాజుపల్లె, బట్టందొడ్డి, తుర్లపల్లె, కొళత్తూరు, లింగాపురం, పెద్దపంజాణిలో 8వ తేదీ సోమవారం, వీరప్పల్లె, నాగిరెడ్డిపల్లె, పెద్దకాప్పల్లెలో మంగళవారం యూరియా పంపిణీ చేస్తామని వ్యవసాయాధికారిణి హేమలత తెలిపారు.

భక్తిప్రపత్తులతో సత్యనారాయణస్వామి వ్రతం



భక్తులకు అన్నదానం

బంగారుపాళెం: పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని మాధవ నగర్‌లోని బ్రహ్మానందాశ్రమంలో ఆదివారం శ్రీసత్యనారాయణస్వామి వ్రతపూజ కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. తొలుత సత్యనారాయణస్వామి మూల విగ్రహానికి ఆశ్రమ నిర్వాహకులు కేశవానంద స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలు చేసిన అనంతరం స్వామివారి చిత్రపటాన్ని మండపంలో కొలువుదీర్చి భక్తులతో సత్యనారాయణస్వామి వ్రతమాచరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహక సభ్యులు, పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.